క్లుప్తంగా

70 మందికి కంటి పరీక్షలు



మక్తల్: పట్టణంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి మహబూబ్‌నగర్ వారి సౌజన్యంతో 30 మందిని కంటి ఆపరేషన్‌కు తరలించారు. ఆదివారం 70 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందికి ఆపరేషన్లు అవసరమయ్యాయని ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కొండయ్య, సత్యనారాయణ, కట్ట వెంకటేష్, వెంకటేశ్వర్‌రావు, అనుగొండ శ్రీనివాసులు, డాక్టర్ ప్రమోద్, కార్యదర్శి డీవీ చారీ, అక్కల సత్యనారాయణ, అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

మొగ్దుం సాబ్ ఉర్సు



ఊట్కూరు: మండలంలోని మొగ్దుంపూర్‌లో సోమవారం మొగ్దుం సాబ్ ఉర్సును ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కందూరులు నిర్వహించారు. సర్పంచ్ సుశీలమ్మ, ఉపసర్పంచ్ వెంకట్రాములు, కార్యదర్శి అచ్యుతానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాపూజ

అమరచింత: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప మహాపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మోదీ మనోహర్ రాజు తెలిపారు. ప్రతి ఏటా జనవరి 3న అయ్యప్ప స్వామి మహాపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మహాపూజలో గణపతి పూజ, పల్లకీ సేవ, కలశపూజతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం పడిపూజ ఉంటుందని భక్తులు అధిక అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

కోయిల్‌కొండ: విద్యార్థులు తమకు అనుకూలమైన క్రీడారంగంలో రాణిస్తే మంచి భవిష్యత్ తోపాటు, సమాజంలో గుర్తింపు లభిస్తుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. గత నెల 27, 31వ తేదీ వరకు చైన్నైలోని టీఎస్‌పీఈఎస్ యూనివర్సిటీలో నిర్వహించిన సబ్‌జూనియర్ నేషనల్ టార్గెట్ బాల్ క్రీడల్లో బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం వారిని పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించారు.

8న ఎస్సెస్సీ మోడల్ టెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే ఎస్సెస్సీ మోడల్ టెస్టును విజయంతం చేయాలని డాక్టర్ ప్రతిభ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మోడల్ టెస్టుకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె సోమవారం ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల కోసం నిరంతరం పోరాడే సంఘం, ప్రతిభను గుర్తించేందుకు పరీక్ష నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించే పరీక్షలకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జొన్న విత్తనాలు

కోయిల్‌కొండ: కోయిల్‌కొండ, అంకిళ్ల, అభంగపట్నం పశువైద్య కేంద్రాలలో ఎస్ఎస్‌జీ–898 రకం జొన్న విత్తనాలు 75శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల పాడి రైతులు తీసుకెళ్లాలని పశువైద్యశాఖ అధికారులు తెలిపారు. 5కేజీల బస్తా రూ.243 ఉండగా సబ్సిడీ పోనూ రూ.60అందించడం అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఐఏపీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్ష స్టేజ్ -1లో ప్రతిభ చాటారు. ఫిజిక్స్ విభాగంలో కే.మేఘా వర్షిత, ఎస్.సాత్విక్‌రెడ్డి, కెమిస్ట్రీ విభాగంలో బి.చరిత, జీ.మనోజ్ఞ, ఎం.వర్షిణి ఉన్నారు. కాగా జాతీయ స్థాయిలో టాప్ టెన్‌లో మనోజ్ఞ, వర్షిణి ఉన్నట్లు చైర్మన్ చంద్రకళావెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కరస్పాండెంట్ పూజితమోహన్‌రెడ్డి, శిరీష్‌ప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఐఏపీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షలో మౌంట్‌బాసిల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐదు విభాగాల్లో నిర్వహించిన పరీక్షకు పాఠశాల నుంచి ఫిజిక్స్ విభాగంలో ఐదుగురు, కెమిస్ట్రీ విభాగంలో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రకళావెంకట్, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లు శిరీష ప్రవీణ్ కుమార్ అభినందించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేకపూజలలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు నాయకులు



కాన్‌కుర్తిలో..



గుడెబల్లూర్‌లో వైకుంఠ ఏకాదశి పూజలు



పేటలో భక్తి గీతాలు అలపిస్తున్న మహిళలు



నర్వలో అఖండ గీతాపారాయణం



మరికల్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతశయన స్వామి, పాండురంగ స్వామి, బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. గోవింద నామస్మరణ మార్మోగింది.

మక్తల్: వైకుంఠఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకొన్నారు.

నర్వ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా నర్వ, పెద్ద కడ్మూర్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మధుసుధన్‌రావు పాల్గొన్నారు. గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో అఖండ గీతాపారాయణం నిర్వహించారు. ఇస్కాన్ టెంపుల్ నుంచి రమాకాంత్, రాధేశ్వరమాధవశర్మ, రామకృష్ణ సేవాసమితి నుంచి జిల్లా కన్వీనర్ రాజ మల్లేష్, ప్రాణేశ్వర్, కోస్గి నుంచి హిందు ధార్మిక సంస్థ సభ్యులు రఘోత్తమాచారి, నర్వ గీతప్రచార కమిటీ కన్వీనర్ నరేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మరికల్: మండలంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కన్యాకపరమేశ్వరీ, ఆంజనేయస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటాలాడాయి.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందుపూర్‌లో శ్రీరామ ఆలయంలో అర్చకుడు ప్రఫుల్‌జోషి, బీజేపీ మండల నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

దామరగిద్ద: ముక్కోటి ఏకాదశి సందర్భంగా కాన్‌కుర్తి, క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాన్‌కుర్తిలో ఎంపీటీసీ బస్వరాజ్, ఉప సర్పంచ్ జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ యువజన నాయకులు బస్వరాజ్, శివరాజ్‌ల సమక్షంలో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

నారాయణపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికులు రూ.మూడు వేలు అదనంగా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3వేలు గౌరవ వేతనం పెంచుతామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నేటికి నిలబెట్టుకోలేదన్నారు. అలాగే ఉచితంగా గ్యాస్ సిలిండర్లను, కోడిగుడ్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నారాయణకు అందించారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటమ్మ, కిష్టమ్మ, సుశీల, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

మరికల్: వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వీరన్న అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. దీంతో చేసేది లేక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేరిప్తున్నారని గుర్తు చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమం చేస్తామని తెలిపారు. సమావేశంలో సూర్యమోహన్, రామకృష్ణ, శేఖర్, రఘు, హరిష్, గోవర్ధన్, మొగులప్పలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్



మద్దూరులో రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ వేస్తున్న అధికారులు



దామరగిద్దలో రోడ్డు విస్తరణలో భాగంగా చెట్టును తొలగిస్తున్న జేసీబీలు

మద్దూరు: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సోమవారం మార్కింగ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి రూ.5 కోట్లతో మద్దూరులోని సినిమా థియేటర్ నుంచి ఖాజీపూర్ చౌరస్తా వరకు 35 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించడానికి ఆర్అండ్‌బీ ఏఈ విష్ణుతేజ, సర్పంచ్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, ఎంపీటీసీ వెంకటయ్య, టీఆర్ఎస్ నాయకులు వీరేష్‌గౌడ్ తదితరులు మార్కింగ్ వేశారు. రోడ్డు వెడల్పులో దుకాణ సముదాయాలు, ఇతర నిర్మాణాలను మార్కింగ్ చేసిన వరకు తొలగించుకోవాలని, త్వరలో నోటీసులు అందజేస్తామన్నారు. తొలగించుకోవాలని నోటీసులు కూడా త్వరలో అందజేయడం జరుగుతుందన్నారు.

మహావృక్షం తొలగింపు

దామరగిద్ద: మండల కేంద్రంలో కొనసాగుతున్న డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా సోమవారం స్థానిక సంజీవరాయ చౌరస్తాలో ఉన్న మహావృక్షాన్ని జేసీబీల సహాయంలో తొలగించారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల చొరవతో చెట్టును తొలగించినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. బీఆర్ఎస్ మండల కార్యదర్శి శరణప్ప తదితరులు ఉన్నారు.

పరామర్శ

ధన్వాడ: కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు బోయ బాల్‌రాజ్(53) అనార్యోగంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అభిజయ్‌రెడ్డి, నరహరి, తదితరులు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ప్రతిభ పరీక్షపై కరపత్రాలు విడుదల



నారాయణపేట టౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ టాలెంట్ టెస్ట్ సంబంధించిన కరపత్రాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయలో పర్యవేక్షణ అధికారి నర్సింహులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు యేటా టాలెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే ఈనెల 8తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పదో తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాశీ, సహాయ కార్యదర్శి రవికిరణ్, పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, నాయకులు మహేష్, నరేష్, పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తపస్ నాయకులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని 20వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జ్ఞానేశ్వర్ గౌడ్ సమక్షంలో మహంకాళిదేవి ఆలయ ఆవరణలో సోమవారం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ పార్లమెంట్ ప్రచార కార్యదర్శి వినయ్‌మిత్ర యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, దేవానంద్ చారి, శంకర్ యాదవ్, అయ్యప్ప స్వాములు సంపత్, రవిగౌడ్, పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో

దామరగిద్ద: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎంఈఓ వెంకటయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు జీహెచ్‌ఎం బాలాజీ, జ్యోతి, విశ్వనాథ్, తపస్ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, దాత వికారాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా మహిళ ప్రముఖ్ జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, భరత్‌కుమార్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డి



మరికల్: మరికల్ సీఐగా శ్రీకాంత్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. వేరేచోటుకి బదిలీ అయిన రాంలాల్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నర్వ, మరికల్, ధన్వాడ మండలాల పరిధిలో శాంతి భద్రతలను కొనసాగించేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది కొత్తగా వచ్చిన సీఐ శ్రీకాంత్ రెడ్డిని సన్మానించారు.

ఘనంగా మహా పడిపూజ



జక్లేర్ మహా పడిపూజలో అయ్యప్పభక్తులు

మక్తల్: జక్లేర్‌లో సోమవారం అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. కలశ ఊరేగింపు చేపట్టారు. అనంతరం అన్నదానం(భిక్ష) చేశారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, సర్పంచ్ నర్సిములు, ఎంపీటీసీ పారిజాత, గురుస్వాములు టీఎస్‌బాబు, అశోక్ ,హన్మంతు, రాంమూర్తి, స్వాములు గోపాలకృష్ణ , అశోక్, లక్ష్మణ్, భరత్, శ్రీకాంత్‌గుప్తా, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి లతో పాటు ఆయా గ్రామాలకు చెందిన 300ల మంది అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన మాలాధారులు

మద్దూరు: అయ్యప్ప స్వామి మాలధారులు సోమవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. పాతబస్టాండ్ ఆంజనేయస్వామి దేవాలయంలో సత్యనారాయణగౌడ్, విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముడులను కట్టారు. గణపశ్రీనివాస్, వీరేష్, పరుశురాం, నరేష్, రామక్రిష్ణ తదితరులు అయ్యప్ప నామస్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. మద్దూరు, పెదిరిపాడ్, క్యాతన్‌పల్లి, చెన్వార్, నిడ్జింత తదితర గ్రామాల 20 మంది స్వాములు శబరిమలకు వెళ్లడంతో ప్రాంతమంతా కోలాహలంగా మారింది.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



జిల్లా కేంద్రంలో అరెస్టయిన నాయకులు



ఊట్కూరు పోలీస్‌స్టేషన్‌లో ..

నారాయణపేట టౌన్ : సర్పంచ్‌ల ఖాతాలలో కేంద్రం జమచేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా వాడుకొందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ధర్నాకు తరలుతున్న వారిని పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. కౌన్సిలర్ ఎండీ.సలీం, అసంఘటిత కార్మిక కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోయ శరణప్ప. మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహిముద్ ఖురేషి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యూసుఫ్‌తాజ్, విజయ్‌కుమార్ ఉన్నారు.

మక్తల్: హైదరాబాద్‌లో ధర్నాకు తరలుతున్న మక్తల్ కాంగ్రెస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరిని గృహనిర్బంధం చేశారు. నాయకులు నర్సిములు, నారాయణ, గోవర్ధన్, రవికుమార్, నూరోద్దీన్, అబ్దుల్‌హుసేన్‌లను అరెస్టు చేశారు.

ఊట్కూరు: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నాకు తరలుతున్న మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు లింగం, జలాల్, నర్సింహులు, ప్రభాకర్, అనిల్ తదితరులు ఉన్నారు.

నర్వ: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించు ధర్నాకు తరలిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, చెన్నయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, నీరజ్, వివేక్‌వర్ధన్‌రెడ్డి, లంకాల్ మహేష్ తదితరులు ఉన్నారు.

మాగనూర్: సర్పంచ్‌ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ దగ్గర నిర్వహించు ధర్నాకు తరలిన మండల నాయకులనపోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

హీరాబెన్‌మోదీకి నివాళి



ధన్వాడ: ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తి హీరాబెన్‌మోదీకి బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. మండల కేంద్రంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. అనంతరం బాటసారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సురేందర్, గోవర్ధన్, మల్లయ్య, ఉమేష్, రాంచంద్రయ్యలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవం



మక్తల్‌లో జరిగిన ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: పట్టణంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే మహోత్సవ లక్ష్యమని ఉత్తరాది మఠం వ్యవస్థాపకుడు యోగేష్ అన్నారు. మఠం ఆవరణలో జరిగిన శ్రీరఘుఉత్తమ తీర్థుల ఆరాధన మహోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యజ్ఞాలు చేయడం, భక్తి కార్యక్రమాలు చేయడం ఆధ్యాత్మికంగా ఉండటం ప్రతిరోజు భక్తి కార్యక్రమాలు చేయడం వల్ల మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మహబూబ్‌నగర్ రూరల్: సావిత్రిబాయి పూలే జయంతి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కోరుతూ అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. దేశంలో మహిళల విద్యకు పెద్దపీట వేస్తూ ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువుకునేందుకు సావిత్రిబాయి పూలే పాఠశాలలు సైతం ప్రారంభించారని తెలిపారు మంగళవారం ఆత్మీయ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాతరోడ్డును పట్టించుకోరా?

- మరుగుపడుతున్న అమీన్‌పూర్ రోడ్డు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు
- గ్రామల చుట్టూ తిరిగి మండలకేంద్రానికి వెళ్తున్న వైనం



అమీన్‌పూర్ రోడ్డుపై కల్వర్టుల పరిస్థితి ఇలా



అమీన్‌పూర్ రోడ్డుపై పెరిగిన ముళ్లపొదలు

ఊట్కూర్: మండల కేంద్రం ఊట్కూర్‌కు అతి సమీపంలో ఉన్న అమీన్‌పూర్ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ పురాతన రోడ్డు మరుగున పడుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముళ్లపొదలు పెరగడం, గుంతలు ఏర్పడడం, చిన్నవాగులపై కల్వర్టులు నిర్మించడం వంటి చర్యలు లేకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితులలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తే గ్రామాల చుట్టూ తిరుగుతూ 26కి.మీ దూరం ప్రయాణం చేస్తున్నారు. అమీన్‌పూర్‌లో దాదాపు 4500 జనాభా, 2600 మంది ఓటర్లు ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల, 3 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. మండల కేంద్రానికి వివిధ పనులకై రైతులు, విద్యార్థులు, ప్రజలు వస్తుంటారు. పాత రోడ్డు మీదుగా వెళ్తే మండల కేంద్రానికి కేవలం 6 కి.మీ దూరమే వెళ్లాల్సి ఉంటుందని, ప్రస్తుతం చుట్టూ తిరిగి 26 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై పగిడిమారి, ఓబ్లాపూర్ మీదుగా వెళ్లడానికి 15 కి.మీ., బస్సులో అయితే పగిడిమారి, నారాయణపేట మీదుగా 26 కి.మీ ప్రయాణించాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రోడ్డు మరమ్మతులు చేపడితే మండల కేంద్రానికి వెళ్లేందుకు దూరాభారం తగ్గుంది. ప్రస్తుతం బస్సులో నారాయణపేట మీదుగా 26 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. చాలా సమయం వృథా అవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

–చంద్రశేఖర్, ఉపసర్పంచ్, అమీన్‌పూర్

దూరాభారం తగ్గించండి



ఊట్కూర్‌కు వెళ్లే పురాతన రోడ్డు మరమ్మతులు లేక మరుగున పడింది. రోడ్డుకు మరమ్మతులతో పాటు రెండు కల్వర్టులు నిర్మిస్తే సమస్య తీరుతుంది. కేవలం 6కి.మీ ప్రయాణం చేస్తే మండల కేంద్రానికి చేరుకుంటాం. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

–టప్పు నాగేశ్, అమీన్‌పూర్

పేదల స్థలాల్లో క్రీడాప్రాంగణమా?



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు, లబ్ధిదారులు

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో దళితులకు 1984లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 123లో 26 మందికి రెండు ఎకరాల 8గుంటల భూమిని ఫ్లాట్లుగా ఇచ్చిందని ప్రస్తుతం అధికారులు అందులో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వాహించారు. పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల భూములను అక్రమంగా భారతీయ రాష్ట్ర సమితి డంపింగ్ యార్డు, క్రీడాప్రాంగణాల పేరుతో తీసుకోవడం సరైన చర్య కాదని అన్నారు. నిరుపేదలైన దళితులు స్తోమత లేనందున ఇప్పటి వరకు ఇళ్లు కట్టుకోలేదని తెలిపారు. ఇప్పుడు అధికారులు వచ్చి ఫ్లాట్లను అక్రమించుకుని క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయడం చాలా దారుణమైన అంశమని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ విషయంపై తహసీల్దార్ దృష్టికి తీసుకు వచ్చిన స్పందించలేదని ఇప్పుడు దళితుల ఫ్లాట్లు దళితులకు ఇవ్వకుంటే పేద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేసి తమకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ అర్జున్ రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కేవీ నర్సింహ, వెంకటేష్ పాల్గొన్నారు.